క్లుప్తంగా

వ్యక్తిపై దాడి, కేసు నమోదు

పెనమలూరు: కానూరులో అపార్టుమెంట్‌లో తలెత్తిన వివాదంతో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌లో సరస్వతీ రెసిడెన్సిలో ఉంటున్న వి.శ్రీనివాసరావు మెయింటెనెన్స్ చెల్లించినందుకు రశీదు అపార్టుమెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు యశ్వంత్‌ను అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం తలెత్తింది. దీంతో యశ్వంత్ ఆగ్రహంతో శ్రీనివాసరావుపై దాడి చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయండి



పెనమలూరు: సమస్యలు ఉంటే నేరుగా వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పెనమలూరు సీఐ ఎం.కిశోర్‌బాబు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కిశోర్‌బాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడానికి పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో తనను వచ్చి కలవాలన్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలు సత్వరం పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రతి సోమవారం పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమస్యలు ఉన్న వారు స్పందనలో పిటిషన్‌లు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు స్పందనలో రావటంతో పరిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు అర్జున్‌రాజు, శేషకుమార్, ఉషా పాల్గొన్నారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: అత్తింటివారిపై పోలీసులు సోమవారం వరకట్నం వేధింపుల కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడపకు చెందిన ముత్యాల కల్పన 2011లో పెడన మండలం ముత్యనగుంటకు చెందిన రాంబాబును వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కటకానుకలు ఇచ్చారు. భర్త హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తాడు. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా భర్తతో పాటు ఆడపడుచు వెంకటేశ్వరమ్మ, మాలతి అదనపుకట్నం తీసుకురమ్మని వేధించసాగారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

మ్యాంగో మార్కెట్‌లో వేబ్రిడ్జిల అద్దెకు వేలం

గన్నవరం: వ్యవసాయ మార్కెట్ కమిటీ గన్నవరం పరిధిలోని విజయవాడ రూరల్ మండలం నున్న మ్యాంగో మార్కెట్‌లో రెండు వేబ్రిడ్జిలను అద్దె ప్రాతిపదికపై కేటాయించనున్నట్లు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఎ.కిషోర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి ఈ నెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు మ్యాంగ్ మార్కెట్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆ రోజు ఉదయం 10 గంటలలోపు రూ. 10 వేలు ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిని 9182361119 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కోడి పందేల శిబిరంపై దాడి

దోనపాడు(పెదపారుపూడి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మండలంలోని దోనపాడు గ్రామంలో ఆదివారం రాత్రి కోడి పందేల శిబిరంపై దాడులు చేశారు. ఈ దాడిలో 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.6,800, రెండు కోడి పుంజులు, 14 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పల్లా నాగకల్యాణి తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సరస్వతీ యాగం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గ మ్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం సరస్వ తి యాగాన్ని నిర్వహించారు. అమ్మవారి ఆల య ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి మందిరం వద్ద యాగశాలలో స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్‌శర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు, వేద పండితులచే యాగం చేశారు. ఆలయ పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, డెప్యూటీ ఈవో గురు ప్రసాద్ యాగంలో పాల్గొన్నారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు , విద్యార్థులకు చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ ఎల్. రమ, సూపరింటెండెంట్ హేమదుర్గాంబ, వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, యువిఎస్ మురళీధర్ శాస్త్రి, పీవీ రఘునాథ శర్మ ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావ'రణం'.. మారాల్సింది మనం



గన్నవరంలో మొక్క నాటుతున్న అధికారులు, సిబ్బంది



పురుషోత్తపట్నంలో పర్యావరణ సంరక్షణ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలు

పెనమలూరు: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని వైద్య శాఖ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ సుదర్శన్‌బాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శాఖ సిబ్బంది పెనమలూరు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సుదర్శన్‌బాబు మాట్లాడుతూ సమాజాన్ని కాలుష్య కోరల నుంచి కాపాడేది చెట్లేనన్నారు. పర్యావరణాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలని, మానవాళికి ఆక్సిజన్ ఇచ్చేది మొక్కలేనన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యుడు రవికుమార్, పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు, ఏవో లోయ శివశంకర్‌రావు, స్థానికులు తోకల త్రినాథ్, తెన్నేటి ప్రకాష్, సూపర్ వైజర్స్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కానూరులో..

తాడిగడప మునిసిపాలిటీ కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు తెలిపారు. ప్లాస్టిక్ భూమి, సముద్రం, అడవుల్లో అత్యంత ప్రమాదకరంగా మారిందని తెలిపారు. ప్రజలు గ్లోబల్ వార్మింగ్ తగ్గించాలన్నారు. విద్యార్థులకు పర్యావరణంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ మౌనిక ,విద్యార్థులు పాల్గొన్నారు.



పెనమలూరు పీహెచ్‌సీలో మొక్క నాటిన అధికారులు, వైద్య సిబ్బంది

న్యాయ కళాశాలలో..

కానూరు శ్రీవెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. అన్ని కళాశాలలో ప్లాస్టిక్ రహిత ప్రాంగణంగా తీర్చిదిద్దాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. దివాకర్‌బాబు తెలిపారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అధ్యాపకురాలు ఎల్.పద్మజ అవగాహన కల్పించారు.

గన్నవరం రూరల్: వీఆర్వో కొండబాబు, సచివాలయం సిబ్బంది, విద్యార్థులతో కలసి గ్రామంలో పర్యావరణ సంరక్షణ ర్యాలీ నిర్వహించారు. పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం తదితరులు పాల్గొన్నారు. తెంపల్లి సచివాలయం వద్ద కార్యదర్శి హర్షవర్ధిని ఆధ్వర్యంలో పర్యావరణాన్ని రక్షిస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.



తేలప్రోలులో మొక్క నాటుతున్న ఎంపీపీ సరోజిని

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఉంగుటూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా ఒక మొక్కను నాటాలని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని పలు గ్రామాల్లో సోమవారం మొక్కలు నాటారు. ఆత్కూరు జెడ్పీ హైస్కూల్ వద్ద జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. ఎంపీడీవో శేషగిరిరావుతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచులు, వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్‌హబ్‌లో సోమవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హరిత వనమహోత్సవం నిర్వహించారు.కళాశాల ఆవరణలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు నేతృత్వంలో మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ అట్లూరి పద్మావతి, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది వినయ్ భూషణ్, సోమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు కొనుగోళ్లు సమర్థంగా నిర్వహించాలి



కంకిపాడు మార్కెట్‌యార్డులో పసుపు కొమ్ముల నాణ్యత పరిశీలిస్తున్న సాంకేతిక బృందం

కంకిపాడు: పసుపు కొనుగోళ్లు సమర్థంగా నిర్వహించాలని ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు అన్నారు. కంకిపాడు మార్కెట్‌యార్డులో కంకిపాడు, పెనమలూరు మండలాలకు చెందిన పలువురు పసుపు రైతులు తెచ్చిన పసుపు కొమ్ములను నాణ్యత పరిశీలన నిపుణులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రైతుల నుంచి నాణ్యమైన పసుపు పంటను కొనుగోలు చేయాలన్నారు. వ్యాపారులకు ఆస్కారం ఇవ్వకుండా రైతుల నుంచే పంటను సేకరించాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పసుపు కొనుగోళ్లను అందుబాటులోకి తెస్తుందని, మద్దతు ధర పొందాలనుకునే రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. మంగళవారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుందని, వివరాలను ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనంద సమ్మేళనం

వీరవల్లి వాణి విద్యానికేతన్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పూర్వ విద్యార్థులతో వాణి విద్యానికేతన్ ఉపాధ్యాయులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎదలోతులో ఏ మూలనో దాగున్న జ్ఞాపకాల దొంతరలు వారి మది నుంచి బయటకు వచ్చాయి. విద్యార్థి దశలో స్నేహితులను చూడగానే నాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. అరేయ్..ఒరేయ్... అసేయ్.. ఒసేయ్.. అంటూ బాల్యమిత్రులను ఆప్యాయంగా పలకరించుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఇలాంటి సందడి వేదికగా మారింది వాణి విద్యానికేతన్. బాపులపాడు మండలం వీరవల్లిలోని వాణి విద్యానికేతన్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ సాగింది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన మిత్రులంతా తిరిగి బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకుని నాటి స్నేహానుభూతులను పంచుకున్నారు. 15 ఏళ్ల తర్వాత 2007-08 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. వారు చదువుకున్న తరగతి గదులు, బెంచీలు చూసుకుని ఎంతో మురిసిపోయారు. తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు నందిగం రవికుమార్, ఉపాధ్యాయులు కొండవీటి సురేష్ మోహన్, రమా సులోచన, రాజశేఖర్, రమాదేవికి శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు ఉదయశంకర్, షేక్ కాలీషా, మణి కిషోర్, ప్రదీప్, అనూష కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

వెదురుపావులూరులో ఆక్రమణల తొలగింపు

- కలెక్టర్ ఆదేశాలు
- టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు ఆక్రమణలోని భూమి పంచాయతీకి అప్పగింత



సూరాయి చెరువు ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

గన్నవరం రూరల్: గతంలో టీడీపీ ప్రభుత్వ అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఆ పార్టీ నేత నిబంధనలకు విరుద్ధంగా చేసిన ప్రభుత్వ భూమి ఆక్రమణలపై అధికారులు కొరడా ఝుళిపించారు. టీడీపీ నాయకుడి ఆధీనంలో ఉన్న చెరువు భూమిలోని ఆక్రమణలు తొలగించి పంచాయతీకి ఆ భూమిని అధికారులు సోమవారం అప్పగించారు. మండలంలోని వెదురుపావులూరు పరిధిలో ఉన్న సూరాయి చెరువు ఆక్రమణలను సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు గన్నవరం రెవెన్యూ అధికారులు తొలగించారు. గ్రామంలోని 308/1, 2, 3, 4 సర్వే నెంబర్లలో సూరాయి చెరువు 48.45ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువులో 308/4లో 99 సెంట్లు ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించిన అధికారులు ఆక్రమణలు తొలగించారు. అయితే ఈ భూమి గతంలో జాస్తి రాజేశ్వరమ్మకు సాగు కోసం అధికారులు డిఫాం పట్టా ఇచ్చినట్లుగా చెబుతున్నారు. అది వారసత్వంగా ఆమె కుమారుడు, మండల టీడీపీ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావుకు సంక్రమించినట్లు అధికారులకు తెలిపారు. అయితే కలెక్టర్ ఉత్తర్వులు అమలు చేస్తూ సూరాయి చెరువు ఆక్రమణలు తొలగించినట్లు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు తెలిపారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



పమిడిముక్కల: మండలంలోని అగినపర్రు, కపిలేశ్వరపురం, గురజాడ, పమిడిముక్కల, మేడూరు శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అగినపర్రు గ్రంథాలయంలో చిన్నారులు పుస్తకపఠనం చేశారు. మ్యూజికల్ చైర్స్, క్యారమ్స్ ఆడించారు. విజేతలకు 11న బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ బొబ్బా లావణ్య తెలిపారు.

గృహాలను వెంటనే నిర్మించుకోండి



గుడ్లవల్లేరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న కాలనీల్లో గృహాలను త్వరితగతిన నిర్మించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్ పేర్కొన్నారు. గుడ్లవల్లేరు వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన లబ్ధిదారులతో సోమవారం మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ డి.శ్రీనివాస్, తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తానా, ఏరియా కో-ఆర్డినేటర్ సుందరరావు పాల్గొన్నారు.

ఖాతాదారుడి నిజాయితీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బ్యాంకు ఏటీఎం కేంద్రంలో లభించిన రూ.5 వేల నగదును హనుమాన్‌జంక్షన్ పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఓ ఖాతాదారుడు. వివరాల్లోకి వెళ్లితే.. విజయవాడరోడ్డులోని కాకాని భవన్ ఎదురుగా ఉన్న భారతీయ స్టేట్ బ్యాంకు ఏటీఎం కేంద్రంలో నగదు తీసుకునేందుకు ఖాతాదారుడు మల్లిశెట్టి సుబ్రహ్మణం సోమవారం వెళ్లాడు. ఏటీఎం మిషన్ నుంచి అప్పటికే రూ.5 వేలు నగదు బయటకు వచ్చి ఉండటం చూసి అవాక్కయ్యాడు. అంతకు ముందు నగదు విత్‌డ్రా చేసుకున్న ఖాతాదారుడు ఈ డబ్బులను మర్చిపోయి వెళ్లిపోవటమో లేక మిషన్ తప్పిదమో జరిగి ఉంటుందని భావించిన అతను తన నిజాయితీ చాటుకున్నాడు. ఏటీఎంలో జరిగిన ఉదంతం చెప్పి రూ.5 వేలు నగదు హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దీంతో పోలీసులు అతన్ని అభినందించారు. అనంతరం బ్యాంకు అధికారులకు పోలీసులు సమాచారం అందించారు.

దుర్గగుడిలో అర్చకులకు అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అర్చకులకు అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో భ్రమరాంబ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు మల్లేశ్వరాలయం, ఉపాలయాలు, ఆర్జిత సేవల్లో విధులు నిర్వహించే వారికి బదిలీలు జరిగాయి. ఏకకాలంలో 87 మంది ప్రధాన అర్చకుల నుంచి సహాయకుల వరకు బదిలీలు నిర్వహించడం ఇదే తొలి సారి. బదిలీ అయిన అర్చకులు గురువారం నుంచి కొత్తగా కేటాయించిన సేవల్లో విధులకు హాజరయ్యే అవకాశం ఉంది. ఖడ్గమాలార్చనను కేఎస్‌డీఎం ప్రసాద్ నిర్వహిస్తారు. ఇక ప్రతి నెలా షష్ఠిని పురస్కరించుకుని నిర్వహించే సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణం ఆరుగు గురు అర్చకులకు ప్రత్యేకంగా విధులు కేటాయించారు.

అంతరాలయం నుంచి...

ప్రస్తుతం అంతరాలయంలో విధులు నిర్వహిస్తున్న వారిలో కొంత మందికి యథాతథంగా విధులు కేటాయించగా, మరి కొంత మందికి ఉపాలయాల్లో విధులు అప్పగించారు. ప్రధాన అర్చకులు ఎల్. దుర్గాప్రసాద్‌కు అంతరాలయం మొదటి షిఫ్ట్, ఎల్ వీఎస్. బద్రీనాథ్‌బాబు రెండో షిఫ్ట్, వెంకట కనక సుందరశర్మకు అంతరాలయం మూడో షిఫ్ట్ కేటాయించారు. ఇక వై.మల్లేశ్వర శాస్త్రి శివాలయంలో ప్రతి నిత్యం మొదటి షిఫ్ట్ కేటాయించారు. ఉప ప్రధాన అర్చకులు అంతరాలయం మొదటి షిఫ్ట్, వై.నాగరాజు శాస్త్రికి ధర్మదర్శనం మొదటి షిఫ్ట్, యంవి. రామమూర్తికి శివాలయం రెండో షిఫ్ట్, వై. శివప్రసాద్‌కు వారాంతపు సెలవులు, నటరాజ స్వామి వారి ఆలయం విధులు, కె. రవికుమార్ అంతరాలయం మూడో షిఫ్ట్, బి. శంకర శాండిల్యకు అంతరాలయం రెండో షిఫ్ట్, పి. శ్రీనివాస శర్మకు శివాలయం నుంచి నటరాజ స్వామి వారి ఆలయం రెండో షిఫ్ట్ కేటాయించారు. ముఖ్య అర్చక కె. హరి వాసుదేవ కుమార్ శర్మకు వారాంతపు సెలవులు, మూడో షిఫ్ట్ నాలుగు రోజులు, రెండు రోజులు ధర్మ దర్శనం క్యూలైన్‌లో విధులు కేటాయించారు. మార్తి యజ్ఞనారాయణ శర్మకు కామధేను అమ్మవారి ఆలయం నుంచి అంతరాలయం రెండో షిఫ్ట్, చండీహోమం, డీవీ సుబ్బారావుకు వారాంతపు సెలవులతో పాటు రెండు షిఫ్ట్ నాలుగు రోజులు అంతరాలయం, రెండు రోజులు ధర్మ దర్శనం, అర్చక మాజేటి సత్యనారాయణమూర్తి, వెంపటి శ్రీధర శర్మ, నుదురుపాటి కార్తీక్‌కుమార్ శర్మ, యు.మురళీధర శాస్త్రి, పీవీ రఘునాథ శర్మలకు అంతరాలయం విధులు కేటాయించారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

స్పందనలో కృష్ణా ఎస్పీ జాషువా



స్పందనలో బాధితుల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ జాషువా

కోనేరుసెంటర్(మచిలీపట్నం): స్పందనలో అందిన అర్జీలను చట్ట పరిధిలో విచారణ జరిపించి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా ఎస్పీ పి. జాషువా అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం స్పందన హాల్లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ న్యాయం కోరుతూ స్పందనను ఆశ్రయించే బాధితులకు పోలీసు శాఖ అండగా నిలుస్తుందన్నారు. ప్రజలు తమకు జరిగిన అన్యాయాన్ని ధైర్యంగా చెప్పుకొని న్యాయం పొందడం కోసమే స్పందన నిర్వహిస్తున్నామన్నారు. సిబ్బంది బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొత్తం 42 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని..

- పెడనకు చెందిన రాగి శ్రీలక్ష్మి టైలరింగ్ వ్యాపారం నిమిత్తం ప్రధానమంత్రి ముద్ర లోన్ కోసం స్టేట్ బ్యాంక్ అధికారులను సంప్రదించి.. వారి సూచనల మేరకు నందం జగదీష్ అనే బట్టల వ్యాపారి వద్ద కొటేషన్ తీసుకుని బ్యాంకుకు సమర్పించారు. బ్యాంకు నుంచి రూ. 1,33, 508 లోన్ మంజూరు కాగా దానిని మూర్తి అండ్ కో పేరు మీద డిపాజిట్ చేశారు. అయితే నందం జగదీష్ తనకు మెటీరియల్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని.. ఫోన్ చేసినా స్పందించడం లేదంటూ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- యనమలకుదురుకు చెందిన అర్షతున్నీసా 2021లో బంటుమిల్లి చెందిన హబీబుల్లా అనే వ్యక్తి ద్వారా రూ.10 లక్షల చీటీ పాడారు. ఆ సమయంలో 50 సెంట్ల పొలాన్ని హామీగా అతని పేరు మీద తనఖా రిజిస్ట్రేషన్ చేశారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆరు నెలల నుంచి చీటీ డబ్బులు కట్టక పోవడంతో హబీబుల్లా వడ్డీలు, చక్రవడ్డీలు వేసి డబ్బులు కట్టకపోతే తనకా రిజిస్ట్రేషన్ చేసిన తమ పొలాన్ని తీసుకుంటానని బెదిరిస్తున్నాడని న్యాయం చేయాలని ఎస్పీకి విన్నవించారు.

కనులపండువగా శాంతి కల్యాణోత్సవం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు, తిలకిస్తున్న భక్తులు

కోడూరు: కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివార్ల శాంతి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ ఉద యం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలను జరిపారు. అనంతరం స్వామివార్లను ఆలయం చుట్టూ ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణవేదికపై శాంతి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. కోడూరుకు చెందిన వ్యాపారవేత్త అద్దేపల్లి మోహనబాబు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. పండితులు మొవ్వ రఘుశేఖరప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించి, కల్యాణంలోని విశేషాలను వివరించారు. రాత్రికి ద్వాదశ ప్రదక్షణలు, పవళింపు సేవ నిర్వహించారు. మంగళవారం ఆలయం వద్ద మహా అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

ఫైనాన్షియర్ల వేధింపులు.. యువకుడు ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఫైనాన్స్‌పై కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనానికి పెండింగ్‌లో ఉన్న వాయిదా సొమ్ము చెల్లించాలని ఒత్తిడి చేయటంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బాపులపాడుకు చెందిన అల్లాడి వంశీ సాయి(19) గత కొంతకాలంగా ఓ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఫైనాన్షియర్ ద్వారా బైక్ కొనుగోలు చేశారు. కొద్ది రోజులుగా బైక్ వాయిదా సొమ్ము చెల్లించకపోవటంతో వంశీ సాయిపై ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధుల ఒత్తిడి అధికమైంది. ఈ నేపథ్యంలో గత నెల 29వ తేదీన వంశీసాయి ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. కొద్దిసేపటికే గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన అతడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వంశీసాయి సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య



గుడ్లవల్లేరు(గుడివాడ): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెండేళ్లగా కానిస్టేబుల్‌గా పని చేస్తున్న పామర్తి వెంకట నాగరాజు(35) అప్పుల బాధలతో పాటు ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు తమ స్వగ్రామం ముదినేపల్లి మండలం పెనుమిల్లి గ్రామంలో ఆదివారం రాత్రి తన నివాసంలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందారు. ఇటీవల ఇల్లు నిర్మించి నాగరాజు అప్పుల పాలయ్యారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఉండటంతో తాళలేక ఆత్మహత్య చేసుకున్నారు. గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోలీసులు పోస్టుమార్టం చేయించి మృతుని కుటుంబానికి అందించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ముగిసిన కనకదేశమ్మ తల్లి జాతర

కృత్తివెన్ను: చినగొల్లపాలెం దీవిలో రెండు రోజులుగా జరుగుతున్న శ్రీ కనకదేశమ్మతల్లి జాతర మహోత్సవం సోమవారంతో ముగిసింది. దీవిలో ఎన్నో దశాబ్దాలుగా పూజలందుకుంటున్న అమ్మవారికి మూడేళ్లకు ఒకసారి గ్రామస్తులు జాతర నిర్వహిస్తారు. ఎంతో పేరు గాంచిన ఈ జాతర మహోత్సవానికి తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ జాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్, వ్యక్తి మృతి

కంకిపాడు: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొన్న సంఘటనలో బైక్ నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. జాతీయ రహదారిపై కొణతనపాడు అడ్డరోడ్డు సమీపంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. కంకిపాడు ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన తాతా కోటేశ్వరరావు (30) తాపీ కార్మికుడు. కంకిపాడు నుంచి బైక్‌పై ప్రొద్దుటూరు గ్రామానికి వెళ్తుండగా కొణతనపాడు అడ్డ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆగిఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలై కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కంకిపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరు గ్రామంలో సోమవారం శ్రీ విజయగణపతి, మూషిక వాహన విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ప్రతిష్ట కార్యక్రమాలు సిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామివారి శాంతి కల్యాణంతో ముగిశాయి. పండితులు లంక శ్రీరామచంద్రమూర్తిశర్మ శిష్య బృందం వేద మంత్రాల మధ్య ఉదయం విగ్రహ ప్రతిష్ట, గణపతి హోమం పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు.